క్లుప్తంగా

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా వీరాంజనేయులు

రాజుపాలెం: మండల కేంద్రంలోని నవోదయ పాఠశాలలో నియోజకవర్గ స్థాయి విశ్వబ్రాహ్మణుల సంఘ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజుపాలెం మండలం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ పూర్వ అధ్యక్షులు కృష్ణమాచారి, చింతాడ రమేష్‌లు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. అధ్యక్షులుగా దూపనగుంట కోటి వీరాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా నారాయణపురం ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా సిద్ధి కృష్ణమాచారి, సహాయ కోశాధికారిగా పాలడుగు హనుమంతరావు, సంఘ సభ్యులుగా ఏలూరి వీరబ్రహ్మాచారి, అద్దంకి భూషయ్య, నారాయణపురం రాంబ్రహ్మాచారి, పానుగంటి శ్రీను, గౌరవ సలహాదారులుగా దూపనగుంట కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వి.మురళీకృష్ణ అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని, ఈసీ నియమావళిని అభ్యర్థులు పాటించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రచారానికి సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 15 వరకు 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందస్తుగా ఫారం-12డీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో ఏఆర్వోలు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, తహసీల్దార్లు సీహెచ్ ఉష (సత్తెనపల్లి), పీ శింగారావు (ముప్పాళ్ళ), ఎల్.లక్ష్మీనారాయణ (నకరికల్లు), ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

పారదర్శకంగా కొనుగోళ్లు

శావల్యాపురం: మండలంలోని అన్నీ రైతుభరోసా కేంద్రాల పరిధిలో కందులు కొనుగోలు పారదర్శకంగా జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది రైతుభరోసా కేంద్రాల పరిధిలో 193 మంది రైతుల వద్ద నుంచి 319.65 మెట్రిక్ టన్నులు ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేశామన్నారు. కందులు అమ్మిన రైతుల బ్యాంకు ఖాతాలో ఇప్పటి వరకు రూ.29.58 కోట్ల రూపాయల నగదు ప్రభుత్వం జమ చేసిందన్నారు.

చలివేంద్రం ప్రారంభం

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గం ప్రధాన కూడలిలో శ్రీరామా పబ్లిక్ స్కూలు సుజరిత ఎడ్యుకేషనల్ సొసైటీ వారి సారథ్యంలో ఉచిత చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుచరిత సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు కె.వి.ఆర్.మోహన్ చందు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి స్వచ్ఛందంగా తాటాకు పందిరి వేసి మట్టికుండల్లో తాగునీరు పోసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కామినేని లక్ష్మీనారాయణ, పెదమదార్, రెడ్డి జ్వాలా నరసింహా రావు, మద్దం చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నాదెండ్ల: గణపవరం సీఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతిలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సునీతాసింగ్ తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నాటికి ఆరేళ్లు నిండి ఉండాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు, రెండో ప్రాధాన్యతగా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పిల్లలకు కల్పిస్తామన్నారు. మిగిలిన ఖాళీల్లో రిజర్వేషన్ ఆధారంగా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. నాలుగు, పదో తరగతిలో ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేస్తామన్నారు. విద్యార్థులు కేంద్రీయ విద్యాలయ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార బుధవారం తెలిపారు. నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ 13 బాటిళ్లు మద్యం కలిగి ఉన్న తన్నీరు శ్రీనివాసరావును అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

చంద్రబాబు కుట్రతో పింఛన్‌దారుల అవస్థలు

- సచివాలయాల వద్ద కిటకిటలాడిన లబ్ధిదారులు
- సచివాలయాల వద్దకు రాలేక అవస్థలు పడ్డ వృద్ధులు, వికలాంగులు



సత్తెనపల్లి మండలం పాకాలపాడు సచివాలయం వద్ద..

సత్తెనపల్లి: ప్రతినెల ఒకటో తేదీన తెల్లవారక ముందే ఇంటి వద్ద చేతికందుతున్న పింఛను సొమ్ములు చూసి మురిసిపోయిన అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు మళ్లీ పాత రోజులు గుర్తొస్తున్నాయి. చంద్రబాబు అండ్ కో కుట్రతో వలంటీర్ల సేవలు నిలిచిపోగా.. సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అనారోగ్య సమస్యలతో మంచం పట్టిన వారికి మాత్రమే ఇంటి వద్ద అందజేస్తామని ప్రకటించారు. మిగిలిన వారు పింఛన్ సాయం పొందాలంటే వ్యయ ప్రయాసలకోర్చి సచివాలయాలకు రావాల్సిన దుస్థితి ఏర్పడింది. బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టడంతో వృద్ధులు, దివ్యాంగుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మెట్లు ఎక్కలేక వృద్ధులు అవస్థలు పడ్డారు. తోడు మనిషి లేకుండా రాలేని స్థితిలో తప్పక పింఛన్ కోసం వచ్చి పడిగాపులు కాశారు.

నిరాశతో వెనుతిరిగిన వృద్ధులు

రాజుపాలెం: వృద్ధులు, వితంతువులు పింఛన్ కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు పడుగాపులు కాసినా ఫలితం దక్కలేదు. బుధవారం నుంచి గ్రామ సచివాలయాలలో పింఛన్‌లు ఇస్తున్నారనే సమాచారంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేచి ఉన్నా పింఛన్ చేతికి అందక పోవడంతో నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. మండలంలోని 14 గ్రామ సచివాలయాలలో ఉదయం నుంచి బారులు తీరారు. కొంత మంది వృద్ధులు ఎండ తీవ్రతను తట్టుకోలేక చెట్ల కింద సేద తీర్చుకున్నారు. వలంటీర్లు ఉదయం 6 గంటలకే పింఛన్ అందించే వారని, తెలుగుదేశం నాయకులు చేసిన కుట్ర వలన ఎండకు ఇబ్బంది పడుతూ పడిగాపులు కాయాల్సి వచ్చిందని వృద్ధులు వాపోయారు.

పింఛన్‌దారుల అవస్థలు

ముప్పాళ్ళ: వృద్ధులు, వితంతువులు, వికలాంగ పింఛన్‌దారులకు ప్రభుత్వం అందించే పింఛన్ సాయం పొందేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లు పింఛన్ల పంపిణీలో పాల్గొనకూడదంటూ ఇచ్చిన ఆదేశాల మేర పింఛన్ సాయం పంపిణీని ప్రభుత్వం సచివాలయ సిబ్బందికి అప్పగించింది. అందులో భాగంగా గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ అందిస్తున్నారని చెప్పటంతో వృద్ధులు, వికలాంగులు పింఛన్ కోసం ఆయా సచివాలయాల వద్ద పడిగాపులు కాసి తీసుకోవాల్సి వచ్చింది. కనీసం సచివాలయాల వద్ద తాగునీటి వసతి కల్పించాలని పింఛన్‌దారులు కోరుతున్నారు. మూడు రోజుల పాటు పింఛన్‌ల పంపిణీ జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ పీ సింగారావు తెలిపారు. చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు.

సాయంత్రం మొదలైన పెన్షన్ల పంపిణీ

క్రోసూరు: ప్రతి నెల ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. ప్రతి నెలా వలంటీర్లు ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు అందజేసే పెన్షన్లు ప్రతిపక్ష పార్టీ ఎన్నికల అధికారులకు చేసిన ఫిర్యాదుతో వలంటీర్ల ద్వారా సింఛన్ పంపిణీ నిలిచిపోయింది. దీంతో పింఛన్ లబ్ధిదారులకు అవస్థలు మొదలయ్యాయి. గ్రామ సచివాలయాలకు చేరుకోవాలన్న సమాచారం మేరకు వృద్ధులు, వికలాంగులు, మహిళలు అనేక మంది అవస్థలు పడుతూ సచివాలయం వద్దకు ఉదయం 9 గంటలకే చేరుకున్నారు. అయితే పంపిణీ సాయంత్రం 5 గంటల తరువాత ప్రారంభించారు. పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో కేవీ రమణ, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య పర్యవేక్షించారు. 15 గ్రామసచివాలయలకు వెళ్లి పంపిణీ కార్యక్రమాలను పరిశీలించారు. బుధవారం 30 శాతం పంపిణీ జరుగుతుందని మిగతా వారికి గురువారం ఉదయం నుంచి పంపిణీ ప్రారంభించి దాదాపు 90 శాతం పూర్తి చేస్తామని ఎంపీడీవో రమణ తెలిపారు.



సత్తెనపల్లిలో ఇరువురి సాయంతో మెట్లు దిగుతున్న వృద్ధుడు

సుమారు 4వేల మందికి పింఛన్ పంపిణీ

నకరికల్లు: తెలుగుదేశం పార్టీ నాయకులు వలంటీర్లపై ఫిర్యాదు, ఎన్నికల సంఘం నిర్ణయం అనంతరం బుధవారం సుమారు 4 వేల మందికి గ్రామ సచివాలయల్లో పింఛన్‌లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 9,720 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్‌దారుని ఇంటికి వలంటీర్లు వెళ్లి పింఛన్ ఇస్తూ వచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లు ఓటర్లను ప్రభావితం చేస్తారంటూ టీడీపీ ఫిర్యాదు మేరకు ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛన్ బుధవారం ప్రారంభిచాల్సి వచ్చింది. కాగా నడవలేని వారు, సచివాలయాలకు తీసుకొచ్చే వారు లేక కేవలం సగం మంది మాత్రమే పింఛన్ తీసుకెళ్లారు. రేపు కూడా పింఛన్ పంపిణీ ఉన్నట్లు సచివాలయం సిబ్బంది తెలిపారు.

పింఛన్ కోసం పడిగాపులు



ధరణికోట సచివాలయం వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు

అమరావతి: తెల్లవారి కోడికూసే వేళకు ఒకటో తారీఖున జగనన్న ఇంటికి పింఛన్ డబ్బులు పంపించాడని వలంటీర్లు చెబుతూ వేలిముద్ర వేయించుకుని డబ్బులు చేతిలో పెడితే అవ్వాతాతల ఆనందానికి అవధులు ఉండేవి కావు. ఎంతో కాలంగా అనారోగ్యంతో మంచాన పడ్డ వారు, నడవలేని వృద్ధులు ప్రతి నెలా పింఛన్ తెచ్చుకోవాలంటే ఎంతో కష్టపడ్డ వారి కష్టాలు తీర్చటానికి ముఖ్యమంత్రి జగన్ ఇంటికే పింఛన్ పంపిణీ అమలు చేశారని ఆనందనద్దారు. ఒకటవ తారీఖునే 95శాతం పింఛన్‌లు అందించటం ఒక్క సీఎం జగనన్న నియమించిన వలంటీర్లకే సాధ్యమని నిరూపితమయ్యింది. కానీ చంద్రబాబునాయుడు కుతంత్రంతో టీడీపీ సానుభూతిపరుడు నిమ్మగడ్డ రమేష్ చేసిన ఫిర్యాదు మేరకు వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకూడదనే ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో బుధవారం వృద్ధులు, వికలాంగులు పింఛన్ తీసుకోవటానికి ఇబ్బందులు పడ్డారు. ఒకటవ తేది ఉదయాన్నే వచ్చే పింఛన్ డబ్బులు రాకపోవటంతో వృద్ధులు ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. బుధవారం పింఛన్ పంచుతారని తెలియడంతో ఉదయం 9 గంటలకే వచ్చి కూర్చున్నామని తెలిపారు. పొద్దున్నుంచి రెండు సార్లు ఇంటికిపోయి వచ్చామని బాగా కాళ్ల నొప్పులుగా ఉన్నాయని వృద్ధులు తమ బాధను వెలిబుచ్చారు. ఎట్టకేలకు ఐదు గంటలకు సచివాలయ సిబ్బంది పించన్‌ల పంపిణీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా పింఛన్‌ల పంపిణీ గురించి లబ్ధిదారులు ఏమనుకుంటున్నారో వారి మాటల్లోనే..

మాకు చేతనైనది చేస్తాం..



తెలుగుదేశం హయాంలో పంచాయతీ ఆఫీస్‌లో ఏ రోజు పింఛన్ ఇస్తారో తెలియక ముసలోళ్లం ప్రతిరోజు పంచాయతీ ఆఫీస్‌కు తిరగాల్సి వచ్చేది. ఒక్కోరోజు అధికారులు రాకపోవటంతో మధ్యాహ్నం వరకు పింఛన్ల కోసం గంటల తరబడి పడిగాపులు కాసేవాళ్లం. ఈ ఐదేళ్లలో 1వ తేదీ తెల్లవారుజామున ఇంటికి తెచ్చిస్తే సంతోషంగా తీసుకునే వాళ్లం. మళ్లా ఇప్పుడు కుతంత్రాలతో పాత రోజులు గుర్తుకు తెచ్చారు. అన్నీ గుర్తుకు పెట్టుకుని మాకు చేతనైనది చేస్తాం.

– కంభంపాటి దేవయ్య, ధరణికోట, అమరావతి మండలం

ముసలోళ్లను ఇబ్బంది పెట్టడం తప్పు..



ఈ వయస్సులో ఎండలో రెండు సార్లు తిరిగి వచ్చా. అసలే ఆరోగ్యం బాగోటం లేదు. ఎండలో తిరగాలంటే ఇబ్బందిగా ఉంది. రాజకీయాలు ఏమోగాని ముసలోళ్లను ఇబ్బంది పెడితే తప్పు గదా. ఇంటి నుంచి సచివాలయానికి పోవాలంటే ప్రాణం మీదకు వస్తుంది ఇలాంటి పద్ధతులు మానుకోవాలి. ఐదేళ్లపాటు 1వ తేదీన పింఛన్ ఇంటికి తెచ్చి ఇచ్చి మంచిచేస్తున్న వలంటీర్లు ఇప్పుడు చెడ్డ వాళ్లు ఎలా అవుతారు. వారు చేసేపని మంచిది కాకుండా పోతుందా.

– షేక్ జైనబీ, ధరణికోట, అమరావతి మండలం



సత్తెనపల్లిలోని 9వ సచివాలయంలో..



గణపవరం గ్రామ సచివాలయంలో..



చాగంటివారిపాలెం గ్రామసచివాలయం వద్ద..



క్రోసూరు గ్రామసచివాలయం వద్ద..



పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

పారదర్శక పాలనకు మద్దతివ్వండి

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పాకాలపాడులో సార్వత్రిక ఎన్నికల ప్రచారం



పాకాలపాడులో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా నీతివంతమైన, పారదర్శక పాలన అందించిన వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ శ్రేణులతో కలిసి బుల్లెట్‌పై సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని ఆదరించాలన్నారు. ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా అందే పింఛన్ల ప్రక్రియపై చంద్రబాబు అండ్ కో ఆరోపించడం తగదన్నారు. టీడీపీ, జనసేన నాయకులు చేసిన పాపానికి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి పేదవాడి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మీకు ఉన్న రెండు ఓట్లను ఒకటి తనకు, మరొకటి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజారీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్, ధూళిపాళ్ల ది ఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివ నారాయణ, గ్రామ సర్పంచ్ తిప్పిరెడ్డి సుజాత, ఎంపీటీసీ కాల్వపల్లి రమేష్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు పింగళి హరినాథ్ రెడ్డి, నాయకులు తిప్పిరెడ్డి హుస్సేన్‌రెడ్డి, కాల్వపల్లి పెద్దిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ప్రలోభాలకు గురికావద్దు



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దారు లక్ష్మి లావణ్య, ఎస్సై సురేష్

శావల్యాపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని తహసీల్దారు సక్కా లక్ష్మీ లావణ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఓటు ఇది మీ హక్కు దృఢమైన ప్రజాస్వామ్యానికై తప్పనిసరిగా ఓటు వేద్దాం.. ఓటింగ్‌లో పాల్గొందాం అంటూ విద్యార్థులచే ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం పెంపొందించటానికి ఈ ర్యాలీ కార్యక్రమం ఎంతోగానో దోహదపడుతుందన్నారు. చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి తప్పనిసరిగా ఓటు వేద్దాం. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. రాజకీయ నాయకుల ప్రలోభాలకు ఓటర్లు లొంగకుండా ఉండాలన్నారు. ర్యాలీలో ఎస్సై చల్లా సురేష్, డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పెరిసోముల నాసరయ్య, వీఆర్వోలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటటౌన్: ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.నారదముని చెప్పారు. బుధవారం పట్టణంలో ఏఎంజీ హైస్కూల్ నుండి చౌత్రా సెంటర్ వరకు ఓటర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ప్రతి ఒక్కరి హక్కు అని చెప్పారు. కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎం జ్వాలా నరసింహం, చిలకలూరిపేట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్ గోవిందరావు, యడ్లపాడు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి షేక్ అప్రవున్నిసాబేగం, బీఎల్‌వోలు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

5న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

నరసరావుపేట: రంజాన్ పర్వదినాలను పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రకాష్‌నగర్‌లోని షాదీఖానా గ్రౌండ్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం పేర్కొన్నారు. పట్టణంలోని ముస్లింలు, న్యాయవాదులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు సహకరించండి

- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు
- రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్



వెల్దుర్తి: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని గుండ్లపాడు, గొట్టిపాళ్ళలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలలో ఆర్వో శ్యాంప్రసాద్, పోలీసులతో కలిసి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలోని వీధుల్లో తిరిగి ప్రజలతో మమేకమై ప్రతి ఒక్కరికీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని వివరించారు. రాజకీయ పార్టీలు ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కు ఓటర్లపై ఉందన్నారు. గతంలో జరిగిన ఘర్షణలను దృష్టిలో పెట్టుకొని ఈ రెండు గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల సీఐలు పి.శరత్‌బాబు, సురేష్, తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ రాజశేఖర్ నాయక్, వీఆర్వో వెంకట్రావు, సెక్టోరియల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నేతలు



పార్టీలో చేరిన బలుసుపాడుకు చెందిన జనసేన నేతలతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి రోజురోజుకు ఆదరణ పెరిగుతుంది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గెలుపే లక్ష్యంగా జోరుగా ప్రచారం చేస్తున్నారు. మండలంలోని బలుసుపాడు గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జనసేన పార్టీలో యాక్టివ్‌గా ఉన్న నేతలు వేణుగోపాలరావు, అశోక్‌లు ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జగనన్న చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి చూసి పార్టీలో చేరినట్లు తెలిపారు. పెదకూరపాడులో వైఎస్సార్‌సీపీ గెలుపుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో వివిధ కులాల పెద్దలతో శంకరరావు చర్చించారు. వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైస్ ఎంపీపీ బాషా, గ్రామ పార్టీ నాయకులు బచ్చు హనుమంతురావు, నల్లమేకల సురేంద్రులు పాల్గొన్నారు.

రాజీనామాల బాటలో వలంటీర్లు

- రెంటపాళ్లలో 30 మంది వలంటీర్లు మూకుమ్మడి రాజీనామా
- చంద్రబాబు తీరుపై వెల్లువెత్తుతున్న నిరసనలు



సత్తెనపల్లి ఎంపీడీవో జగదీష్‌కు రాజీనామా పత్రాలు అందిస్తున్న రెంటపాళ్ల వలంటీర్లు

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పురుడు పోసుకున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. సంక్షేమ ఫలాలు పేదల గడప చెంతకే చేరవేస్తుండడంతో పాటు కోవిడ్, విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలిచి ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిన వలంటీర్ల సేవలు ప్రతిపక్ష పార్టీల నేతలకు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. గోనె సంచులు మోసే అవేం ఉద్యోగాలు, ఇళ్లల్లో మగవాళ్లు లేనప్పుడు తలుపులు కొట్టి కొంపలు కూలుస్తున్నారంటూ వలంటీర్లపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేస్తే... రాష్ట్రంలో మహిళల మిస్సింగ్‌కు వలంటీర్లే కారణం అంటూ పవన్ కళ్యాణ్ విషం కక్కారు. ఇప్పుడు వారి అనుకూల వర్గంతో తప్పుడు ఫిర్యాదులు చేయించి వాళ్ల సేవలను అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పేదలకు సేవలందించకుండా టీడీపీ, జనసేన పార్టీలు చేసిన కుట్ర రాజకీయాలను నిరసిస్తూ ఈసీ ఆంక్షల నేపథ్యంలో సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి చెందిన 30 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు బుధవారం రాజీనామా చేశారు. సత్తెనపల్లి ఎంపీడీవో జగదీష్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు.

మనస్థాపంతో రాజీనామాలు...

ప్రజలకు సేవ చేస్తున్న తమ పట్ల ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ఫిర్యాదులు చేసి వేధింపులకు గురిచేస్తుండడంపై వలంటీర్లు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు. వారి వేధింపులు తాళలేక మూకుమ్మడిగా తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేస్తున్నారు.

కాలువలపై గ్రిల్స్ ఏర్పాటు చేసుకోండి



నరసరావుపేట: షాపుల ముందు మురికి కాలువలపై సిమెంట్‌తో శాశ్వత నిర్మాణాలు చేయకుండా కాలువల్లోని పూడిక తీసేందుకు అనుగుణంగా గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చింతా రవించంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం 20, 21 వార్డుల్లోని వర్కర్స్ కాలనీ, పల్నాడు మెయిన్ రోడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా సంబంధిత వార్డు ప్రజలు కాలువల్లో మురుగునీరు పోవడం లేదని, ఆ నీరు రోడ్డుపై వస్తున్నాయని, నిర్మాణాలు చేసేవారు కాలువ పూడ్చడం వల్ల నీరు పోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై తనతో ఉన్న ఇంజనీరింగ్ శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగ సిబ్బందిని భవనం ర్యాంపును బ్రేక్ చేసి కాలువలు తీసేందుకు గ్రిల్స్‌ని ఏర్పాటు చేయాలని, శానిటేషన్ సిబ్బంది కాలువలో పూర్తిస్థాయిలో డీసిల్టు చేయమని ఆదేశించారు.